


*ఎవరికీ చెప్పక*

**కొన్ని నవలల** గురించి రాయటానికి మెటీరియల్ విస్తారంగా ఉంటుంది. కొన్నిటికి ఉండదు. అలా ఎక్కువ మెటీరియల్ లేని నవల 'ఎవరికీ చెప్పక.'




1990లలో ఇండియాలో స్టార్ టివి ఛానల్స్ అనేకం వచ్చాయి. ఓ దాంట్లో 'ఎక్సైల్స్' అనే అమెరికన్ టి.వి సీరియల్ ప్రసారం అయ్యేది. దాంట్లోని హీరో హీరోయిన్లు ఎఫ్.బి.ఐ ఏజెంట్లు. హారర్, సైంటిఫిక్, సూపర్ నేచురల్ నేపథ్యంలో అవి థ్రిల్లర్స్‌గా సాగేవి. ఓ రోజు నేను వాటిలో ఓదాన్ని చూసాను. అందులోని పాయింట్ మరణించిన ఓ వ్యక్తి శవంలోకి ఇంకొకరి ఆత్మ ప్రవేశించడం. ఈ పాయింట్ తప్ప మిగతా కథ గుర్తులేదు.

అలా ఓ భర్త శవంలోకి మరొకరి ఆత్మ ప్రవేశించి ఆ సంగతి భార్యకి తెలిస్తే? అనే ఆలోచన కలిగింది. ప్రవేశించిన ఆత్మకి కూడా అది తన శరీరం కాదని తెలిస్తే? ఈ రెండు అంశాల చుట్టూ ఓ కథని అల్లుకున్నను. సినాప్సిస్ రాసుకుని పక్కన పెట్టాను. గతంలో చదివిన ఓ న్యూస్ ఐటం నాకు గుర్తుండిపోయింది. ఓ యూరోపియన్ దేశంలోని ఓ వ్యక్తి పురుషాంగం ప్రమాదవశాత్తు తెగిపోతే, మరొకరి పురుషాంగాన్ని అతనికి ఇంప్లాంట్ చేసారు. పరాయి పురుషుడి పురుషాంగం విషయంలో ఆ వ్యక్తి భార్య ఎలా ఫీలవుతుంది? అని నాకు అనిపించింది. అది కూడా ఈ నవలకి ప్రేరణ అనే చెప్పాలి.

1996 మార్చిలో అనుకుంటా ఆంధ్రజ్యోతి వీక్లీకి శ్రీ త్రిపురనేని శ్రీనివాస్ ఎడిటర్ అయ్యారు. ఆ సంగతి ఆనందంగా చెపుతూ వెంటనే సీరియల్ కావాలని, అది ఖచ్చితంగా క్రైం, సస్పెన్స్ సీరియల్ అయి ఉండాలని ఫోన్ చేసారు. ఉదయం ఏడుకి ఫోన్ చేసి, 'మధ్యాహ్నం రెండుకల్లా ఇవ్వగలరా?' అని వత్తిడి తెస్తున్నాననే మొహమాటంతో కోరారు.

ఇవ్వగలనని చెప్పాను. మొదటి సంచికకి కొద్ది పేజీల ఇంట్రో ఇచ్చి, తర్వాత రెగ్యులర్‌గా రాసేటన్ని పేజీలు రాయచ్చని కూడా సూచించారు.

ఓ మాట కూడా బెదిరింపుగా చెప్పారు.

"సీరియల్ బావుంటే పాఠకులు మీరు బాగా రాసారు అంటారు. రాయకపోతే మల్లాది మంచి సీరియల్ రాయలేదు అంటారు. అందులో నాకు పోయేది ఏం లేదు."

ఆ రోజుల్లో చాలామంది సంపాదకులకి నా సీరియల్స్ మీద ఇదే అభిప్రాయం ఉండేది.




నేను రాసుకున్న ఆ సినాప్సిస్ తీసి ప్రధానపాత్రలు, కథ, మొదలు, తుది మొదలైనవి ఓ గంటలో ఛాప్టర్స్‌గా ఎక్స్‌పేండ్ చేసి రాసుకున్నాను. అంతదాకా సీరియల్‌ని ఎన్నడూ నేను డిక్టేట్ చేయలేదు. మొదటిసారి పద్మజకి 'ఎవరికీ చెప్పక' మొదటి సంచిక మేటర్ని డిక్టేట్ చేసాను. అనువాధ కథలని డిక్టేట్ చేయడం తప్ప నేను స్వయంగా రాసేది నేను రాయటమే ఈ రోజుకీ నాకు అలవాటు.

నవల మొదటి పేజీల్లోని నాందీ ప్రస్థావన అలా డిక్టేట్ చేసిందే స్థూలంగా కథ ఇది.

నిరతికి చిన్నప్పటినించీ క్లైయిర్వాయెన్స్ ఉంటుంది. ఆత్మలు కనపడుతూంటాయి. ఏడేళ్ళ నిరతి తన తమ్ముడి మరణం గురించి తల్లితండ్రులకి చెప్పినా వాళ్ళు నమ్మరు. నిరతి భర్త కాశ్యప్ చాలా మంచివాడు. తను, తన కుటుంబం తప్ప బయటి ప్రపంచం పట్టని వ్యక్తి. బేంక్‌లో పనిచేస్తూంటాడు. హెలీనా అనే ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌కి గల కవల సోదరి క్రిస్టినా. వాళ్ళకి ముప్పై ఐదు ఏళ్ళు వచ్చినా ఇద్దరూ అచ్చు గుద్దినట్లుగా ఒకేలా కనిపిస్తుంటారు. క్రిస్టినా తరచు తన సోదరి హెలీనాలా నటించి ప్రాక్టికల్ జోక్స్ వేస్తూంటుంది. వాళ్ళు ఆంగ్లో ఇండియన్స్. కారణం ఆంగ్లో ఇండియన్స్ సంతతి అంతరించి పోతోందని, వాళ్ళ గురించిన వివరాలతో ఓ ఆర్టికల్ చదివాను. ఇందులో వారు స్వతంత్రం వచ్చిన కొత్తల్లో పడ్డ ఇబ్బందులు రాసాను.

కథారంభంలో నిరతి గర్భవతి. 'ఐదేళ్ళ తర్వాత నేను ఎక్కడ ఉంటాను?' అనే కాశ్యప్ ప్రశ్నకి భవిష్యత్తు చెప్పే మారుతమ్మ అనే ఒకామె 'హెల్' అని జవాబు చెప్తుంది. కొద్దివారాల తర్వాత ఎలక్ట్రిక్ షాక్‌తో కాశ్యప్ హాస్పిటల్లో చేరతాడు. అతని పక్క బెడ్‌లో పాము కాటు తిన్న శ్యామలరావు ఉంటాడు. ఇద్దరూ ఒకేసారి మరణిస్తారు. శ్యామలరావు వివరాలు తెలీక అతని దేహాన్ని మార్చురీలో ఉంచుతారు.

1975లో అనుకుంటా నేను చదివిన ఓ వార్త గుర్తుంది. అప్పట్లో సత్యసాయి నిగమాగమం దగ్గర చెట్లు, పొదలు ఉండేవి. పొరుగూరు నుంచి వచ్చిన ఒకరు అక్కడ కూర్చుని మూత్రం పోసి సిటీ బస్‌లో సికింద్రాబాద్ స్టేషన్‌కి వెళ్తూండగా చనిపోయాడు.

అతను పాముకాటు తిని పోయాడని పోస్ట్‌మార్టంలో తెలిసింది. అతను మాత్రం మూత్రం పోసేప్పుడు ఏదో కుట్టిందని కండక్టర్‌కి చెప్పాడు. 1976లో పంజగుట్టలో నేటి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఓ బస్‌స్టాప్ ఉండేది. అక్కడ చచ్చిన తాచుపాముని ఎవరో ఉంచి వెళ్ళారు. నాకా స్టాప్‌లో అది కనిపించింది. శ్యామలరావుకి కూడా అలాంటి చోట హైదరాబాద్‌లో పాము కాటు వేస్తుంది.

గుండె ఆగిన నాలుగు నిమిషాలకి కాశ్యప్ తిరిగి బతుకుతాడు. అతనిలో శ్యామలరావు ఆత్మ ప్రవేశించింది. కాశ్యప్ శరీరంలోని శ్యామలరావు ఆత్మకి తన పాత జీవితం గుర్తుంటుంది. ఆ తర్వాత నిరతితో అతని జీవితం ఎలా సాగుతుంది? నిరతికి ఈ విషయం ఎలా తెలుస్తుంది? తెలిసి ఏం చేస్తుంది? చివరికి ఆ సమస్యలోంచి నిరతి ఎలా బయటపడుతుంది? ఇదీ ఈ నవల స్థూల కథ.

మధుమేహ రోగానికి చెందిన అనేక విషయాలని నేను కోరితే దావణగిరికి చెందిన అభిమాని డాక్టర్ ఎం.శ్రీనాథ్ రెడ్డి పంపారు.

అప్పట్లో తమిళంలో ఓ సినిమా వచ్చింది. దాని పేరు 'యారికీ సొల్లాదే' అని గుర్తు. దాని అర్థం ఎవరికీ చెప్పక. ఆ పేరు ఈ కథకి సరిపోతుంది కాబట్టి ఆ పేరు పెట్టాను. ఓ మేజిస్ట్రేట్ కవల సోదరుడు సరదాగా తన సోదరుడి స్థానంలో కోర్ట్‌కి వెళ్ళి ట్రాఫిక్ కేసులకి ఫైన్ వేసేవాడు. ఆ సంగతి బయటపడ్డాక గత ఐదేళ్ళల్లో ఆ మేజిస్ట్రేట్ విధించిన అన్ని ట్రాఫిక్ ఫైన్లని వెనక్కి ఇవ్వమని పై కోర్ట్ తీర్పు ఇచ్చిందని ఓ విదేశీ దినపత్రికలో చదివాను. ఆ ఉదంతాన్ని క్లైమేక్స్‌లో హీరోయిన్‌ని హత్యానేరం నించి రక్షించడానికి ఉపయోగించుకున్నాను.

అప్పట్లో నవలలు చదివాక తప్పులని నాకు తెలియచేస్తూండేవారు. వాటిని ఫైల్ చేసి తర్వాతి ఎడిషన్లో సవరించేవాడిని. రెండో ఎడిషన్ రాని, ఇంకా తప్పులు సవరించని నవలల్లోని తప్పుల ఉత్తరాలు ఇంకా నాదగ్గర భద్రంగా ఉన్నాయి. వైష్ణవాలయంలో నిరతి నవగ్రహాలకి ప్రదక్షిణ చేస్తుందని రాసాను. కానీ వైష్ణవాలయంలో నవగ్రహాలు ఉండవని, కేవలం శివాలయంలోనే అవి ఉంటాయని ఓ పాఠకుడు తప్పు పట్టుకుని రాసాడు.

జనవరి 1997 లో ఇది పుస్తకంగా వెలువడింది. వెల రూ 60/- మొదటి ఎడిషన్‌ని లిపి పబ్లికేషన్స్ ప్రచురించింది. లిపి ప్రచురణల్లో వేగంగా అమ్ముడైన పుస్తకాల్లో ఇదొకటి. ఓ కన్నడ మాసపత్రికలో సీరియల్‌గా వెలువడింది. రెండో ఎడిషన్ రాలేదు కాబట్టి ఇది ప్రస్తుతం మార్కెట్లో లేదు.

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***